సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం 9 ఏప్రిల్ 2024



పంచాంగం ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: అమృతకాల పంచాంగాన్ని కోర్టు ప్రాంగణంలో సోమవారం జిల్లా జడ్జి ప్రేమలత ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరం మంచి చేస్తుందని ఆకాంక్షించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ(సా.)	సహర్ బుధ(ఉ.)
కరీంనగర్	6.26	4.33
పెద్దపల్లి	6.36	4.44
రాజన్న సిరిసిల్ల	6.36	4.42
జగిత్యాల	6.36	4.40

గరిష్టం/కనిష్టం
38.0/26.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

10న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న హుండీ లెక్కింపును ఈనెల 10న ఉదయం 8 గంటల నుంచి ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సకాలంలో హుండీ లెక్కింపునకు హాజరుకావాలని కోరారు.

కూలీల పని దినాలు పెంచాలి



బోయినపల్లి(చొప్పదండి): ఉపాధిహామీ కూలీల పనిదినాలు పెంచాలని డీఆర్డీవో శేషాద్రి కోరారు. మండల పరిషత్‌లో సోమవారం ఉపాధిహామీ పనుల్లో లేబర్ ప్రగతిపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్షించారు. డీఆర్డీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కూలీల భాగస్వామ్యం పెంచాలని కోరారు. ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో బీమా జయశీల, ఎంపీవో గంగాతిలక్, ఉపాధిహామీ ఏపీవో వనం సబిత ఉన్నారు.

నేతన్నలకు ఉపాధి కావాలి



సిరిసిల్లటౌన్: నేతకార్మికులకు ప్రభుత్వం శాశ్వత ఉపాధి కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ కోరారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, యాభైశాతం కరెంట్ సబ్సిడీ అందించాలని కోరారు. కార్మికులకు పది శాతం బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆడెపు రవీందర్, నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ సమస్య పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: వస్త్రపరిశ్రమ సంక్షోభాన్ని పరిష్కరించాలని ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సోమవారం హైదరాబాద్‌లో జిల్లా వామపక్ష నేతలతో కలిసి విన్నవించారు. ఆర్థికశాఖ మంత్రి భట్టివిక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ బిల్లులు అందించాలని కోరారు. మూశం రమేశ్, పంతం రవి పాల్గొన్నారు.

చేయూతను సద్వినియోగం చేసుకోండి



సిరిసిల్లటౌన్: భవన కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లేబర్ అధికారి రఫీ కోరారు. న్యాక్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కోర్సు ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. న్యాక్ ఇన్‌చార్జి గంగాధర్, రవి, సిరిగిరి మంజుల, కూర శ్రీధర్ ఉన్నారు.

టెట్ ఫీజు తగ్గించండి



సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. ఈమేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో టెట్‌కు రెండు పేపర్లకు రూ.400 నిర్ణయించిందని, ఇప్పుడు ఒక్కో పరీక్షకు రూ.వెయ్యి పెంచిందని తెలిపారు. మట్టి శ్రీనివాస్, రుద్రవేణి సుజిత్ కుమార్, గౌరీ రాకేశ్, కోడం వెంకటేశ్, రంజిత్, వంశీ, అరవింద్ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సేల్‌టాక్స్, జీఎస్టీ అధికారులమంటూ తంగళ్లపల్లి ప్రధాన రహదారిపై గూడ్స్ వాహనాలను ఆపి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని 'వాహనాల తనిఖీ పేరుతో వసూళ్ల దందా' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. 'సాక్షి' కథనంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. నకిలీ అధికారులు కాదని సొంతశాఖలోని కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అక్రమ వసూళ్లతో పరువు తీశారంటూ ఓ ఉన్నతాధికారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

రాజపూజ్యం ఎవరికో?



- నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ స్థానాల్లో రసవత్తర రాజకీయం
- ప్రధాన పార్టీల్లో రాజయోగం వరించేదెవరినో?
- క్రితంసారి అనూహ్య విజయాలు నమోదు
- ఈసారి మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో జగిత్యాల, మెట్‌పల్లి నిజామాబాద్ పరిధిలోకి, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్ కరీంనగర్ పరిధిలోకి, పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్ పరిధిలోకి వస్తాయి. మూడు స్థానాల్లోనూ అభ్యర్థులకు ఈ ఎన్నికలు చాలా కీలకం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎలాగైనా వీటిని కైవసం చేసుకోవాలని చూస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండింటినైనా గెలిచి, తిరిగి పట్టు నిలుపుకోవాలని పావులు కదుపుతోంది. ఐదేళ్ల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సామాన్యులుగా రంగంలోకి దిగిన బండి సంజయ్(కరీంనగర్) సిట్టింగ్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఓడించి, ధర్మపురి అర్వింద్(నిజామాబాద్) సిట్టింగ్ ఎంపీ కవితపై పైచేయి సాధించి, అనూహ్య విజయాలను అందుకున్నారు. ఈసారి తమ స్థానాలను నిలబెట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండగా.. అదే స్థాయిలో కాంగ్రెస్ కూడా వ్యూహాలు రచిస్తోంది.


బండి సంజయ్ (బీజేపీ)


డి.అర్వింద్ (బీజేపీ)


టి. జీవన్‌రెడ్డి (కాంగ్రెస్)


గడ్డం వంశీ (కాంగ్రెస్)


కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)


బి. వినోద్ (బీఆర్‌ఎస్)


బి. గోవర్ధన్ (బీఆర్‌ఎస్)


జి. శ్రీనివాస్ (బీజేపీ)

నినాదాలు.. మేనిఫెస్టోలు..

నిజామాబాద్, పెద్దపల్లిల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ తమ అభ్యర్థుల్ని ఇప్పటికే ప్రకటించాయి. వారు ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్దన్(బీఆర్‌ఎస్), ధర్మపురి అర్వింద్(బీజేపీ), తాటిపర్తి జీవన్‌రెడ్డి(కాంగ్రెస్)లు పోటీ పడుతున్నారు. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ(కాంగ్రెస్), గోమాస శ్రీనివాస్(బీజేపీ), కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)లు బరిలో ఉన్నారు. కీలకమైన కరీంనగర్ నుంచి బండి సంజయ్(బీజేపీ), బి.వినోద్‌కుమార్(బీఆర్‌ఎస్)లు బరిలో ఉండగా.. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. దేశభక్తి, అయోధ్య రామాలయం, ఉమ్మడి జిల్లాలో ప్రారంభించిన ప్రాజెక్టులు, హిందుత్వమే ఏజెండాగా బీజేపీ దూకుడుగా వెళ్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అధికారం కట్టబెట్టిన 6 గ్యారంటీలనే కాంగ్రెస్ నమ్ముకుంది. దీనికితోడు కేంద్ర నాయకత్వం ప్రకటించిన 'పంచన్యాయ్', రాష్ట్రానికి ప్రత్యేకంగా ప్రకటించిన మేనిఫెస్టో తమకు మేలు చేస్తాయని భావిస్తోంది. జాతీయ పార్టీలు రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవని, తెలంగాణ గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే.. తప్పకుండా తమను గెలిపించాలని బీఆర్‌ఎస్ కోరుతోంది.

పార్లమెంట్ స్థానాల జాతక చక్రం

ఎంపీ స్థానాలు : 3
ప్రధాన పార్టీల అభ్యర్థులు : 9 మంది
రాజపూజ్యం : ముగ్గురికి
వ్యయం : రూ.కోట్లు, ఆదాయం : ఓట్లు

ఈసారి ఖర్చు రూ.కోట్లలోనే..

ఈసారి పార్లమెంట్ ఎన్నికల ఖర్చు క్రితంసారితో పోలిస్తే పెరిగేలా ఉంది. ప్రచారం, పెట్రోల్, భోజనం, సభల నిర్వహణ ఖర్చు అమాంతం పెరిగింది. ఇక, జన సమీకరణ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ లెక్కన అభ్యర్థుల వ్యయం శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రూ.కోట్లలో ఉండనుందని సమాచారం. దీనికి ప్రతిఫలంగా ప్రజలు ఓట్ల రూపంలో ఆదాయం ఇవ్వనున్నారు. ఇది ఎవరికి అధికంగా ఉంటే వారినే రాజయోగం వరించనుంది. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థులు ఇప్పటికే తమ జాతకాలను పరీక్షించుకుంటున్నారు. ఎవరి ఆదాయ, వ్యయాలు ఎంత? ఎవరి రాజపూజ్యం ఎంత? ఎవరికి రాజయోగం ఉంది? తదితర వివరాలను పండితులను అడిగి తెలుసుకుంటున్నారు.

'క్రోధి' వచ్చె.. ఆనందం తెచ్చె..



తెలుగువారి పండుగ ఉగాది రానే వచ్చేసింది. తెలుగు వాకిళ్లలో క్రోధి నామ సంవత్సరం సందడి మొదలైంది. ఉగాది అంటే ప్రతీ ఒక్కరికి గుర్తుకొచ్చేది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనమే పండుగ ప్రత్యేకత. జీవితంలో వచ్చే కష్టసుఖాలను అందరూ అనుభవించాలని గుర్తుచేసేదే పచ్చడి. హిందూ పురాణాల ప్రకారం, ఉగాదిలో 'ఉగ' అంటే నక్షత్ర గమనం.. ఈ గమనానికి ఆది ఉగాది.. అంటే సృష్టి ఉగాది రోజు నుంచే ప్రారంభమైందని అర్థం. చైత్రమాసం శుక్లపక్షంలో సూర్యోదయ వేళకు పాడ్యమి తిథి రోజును ఉగాదిగా నిర్ణయిస్తారు. ఈ పండుగను తెలుగువారే కాకుండా మరాఠీలు 'గుడిపడ్వా'గా, తమిళులు 'పుత్తాండు', మలయాళీలు 'విషు', సిక్కులు 'వైశాఖీ', బెంగాలీలు 'పోయ్ లా బైశాఖ్'గా జరుపుకుంటారు. ఈ సమయంలో ప్రముఖ ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం పఠిస్తారు. ఈ నేపథ్యంలో క్రోధి నామ సంవత్సరంలోకి అడుగు పెట్టనున్నాం.





ఓటు హక్కును మరువద్దు

సిరిసిల్ల: రాజ్యాంగ కల్పించిన ఓటుహక్కును మరువద్దని, అర్హులు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సిరిసిల్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి కోరారు. సిరిసిల్లలో సోమవారం ఉదయం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' పేరిట నిర్వహించిన 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రలోభాలకు లోను కావద్దని కోరారు. సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ మాట్లాడుతూ మార్చి 31 వరకు 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ షరీఫ్ మొహినొద్దీన్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, జిల్లా స్పోర్ట్స్, యూత్ అధికారి అజ్మీరా రాందాస్, డీఆర్‌డీఏ ఏపీవో పాపారావు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఎక్కువిస్తాం

- నేతన్నలకు అండగా ఉంటాం
- మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల: గత ప్రభుత్వం కంటే ఎక్కువగానే వస్త్రోత్పత్తి ఆర్డర్లను ఇస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్రవ్యాపార సంఘం భవనంలో సోమవారం వస్త్రోత్పత్తిదారుల జేఏసీ నాయకులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.270కోట్లను దశలవారీగా చెల్లిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలే అయిందని, ప్రతిపక్షాలు శవ రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. నేతన్నలకు చేతినిండా పని కల్పించే బాధ్యత తమదన్నారు. విద్యుత్ సబ్సిడీని పరిశీలిస్తామని, మగ్గాల ఆధునికీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు.

పరిశ్రమను ఆదుకుంటాం : ఆది శ్రీనివాస్

వస్త్రపరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌ఐ యూనిట్లను మార్చుకుంటే.. విద్యుత్ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. కె.కె.మహేందర్‌రెడ్డి, చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, గోలి వెంకటరమణ, జేఏసీ నాయకులు దామోదర్, సత్యం, మధు, లక్ష్మీనారాయణ, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, రమేశ్, రవి, రమణ, దామోదర్, నవీన్, కట్టెకోల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏం తెచ్చావని దీక్ష చేస్తావ్ ?

ఎంపీగా నేతన్నలకు ఏం తెచ్చావని దీక్ష చేస్తావని బండి సంజయ్‌కుమార్‌ను పొన్నం ప్రశ్నించారు. పార్టీ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర జౌళి పథకాలు తమిళనాడుకు పోతుంటే.. సిరిసిల్లకు ఏం చేశావో తెలపాలన్నారు. మంత్రిగా ఉండి కేటీఆర్ రూ.558 కోట్ల బకాయిలు పెట్టారన్నారు.

జేఏసీ పోరాటం తాత్కాలిక విరమణ

సిరిసిల్లటౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇచ్చిన హామీతో తమ పోరాటాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వస్త్రపరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ ప్రతినిధులు ప్రెస్‌మీట్‌లో తెలిపారు. వారు ఇచ్చిన హామీలతో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి

- సిజేరియన్లు చేసే ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి


సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సోమవారం సమీక్షించారు. వంద శాతం సిజేరియన్లు చేసే ప్రైవేట్ దవాఖానాలపై చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేర్లు నమోదు చేసుకుని, ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు చేస్తున్న వైద్యపరీక్షలపై ఆరా తీశారు. ఎంత మంది విద్యార్థినులు ఎనీమియాతో బాధపడుతున్నారని, వారికి ఎలాంటి మందులు అందిస్తున్నారోనని తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గర్భిణుల స్కానింగ్, అబార్షన్లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.గౌతమి, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆర్‌ఎంవో సంతోష్‌కుమార్, జిల్లా ఉప వైద్యాధికారులు శ్రీరాములు, రజిత, పర్యవేక్షకులు మురళీధర్‌రావు, మహేశ్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్లు నయీంజహా, ఉమ తదితరులు పాల్గొన్నారు.

బడిలో పనులు గుర్తించండి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో గుర్తించిన తర్వాతే ముందుకెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతు పనులపై సమీక్షించారు. కమిటీలను ఏర్పాటు చేయాలని, జాతీయ బ్యాంక్‌లలో ఖాతాలను తెరవాలని సూచించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జెడ్పీ సీఈవో ఉమారాణి, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ డీఈ అనిత సింగనాథ్, డీఈవో రమేశ్‌కుమార్, డీఆర్డీవో శేషాద్రి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

లీకేజీల వృథా

సిరిసిల్ల: ఏప్రిల్ మాసంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ పైపు లైన్లు, నల్లాపైపుల లీకేజీతో వృథా అవుతుంది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చంద్రంపేట క్రాస్ రోడ్డు వద్ద నల్లాపైపు నిరంతరం లీకేజీ అవుతుంది. సిరిసిల్ల గాంధీ చౌక్ నుంచి పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లే దారిలో నటరాజ్ థియేటర్ వీధి వద్ద నల్లాపైపు కారిపోతుంది. సిరిసిల్ల శివారులోని రగుడు వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకేజీ అవుతుంది. అక్కడ నీరు కారి నాచుపెరిగింది. ఆ కలుషిత నీరు మళ్లీ నల్లా పైపుల్లోకి వెళ్లి.. సరఫరా కావడంతో రంగుమారిన నీరు నల్లాల్లో వస్తుంది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో మంచినీటికి ఇబ్బందులు ఎదురవుతుండగా.. మరోవైపు శుద్ధిచేసిన నీరు లీకేజీలతో వృథా అవుతుంది. మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు లీకేజీల కట్టడికి రిపేర్లు చేస్తున్నా.. నీరు వృథా అవుతూనే ఉంది.


మున్సిపల్ ఆఫీస్ వెనకాల పబ్లిక్ బోర్ పైపు పగిలి వృథాగా పోతున్న నీరు


రగుడు వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ


నటరాజ్ థియేటర్ వీధి వద్ద నల్లా పైపు లీకేజీ

రాజన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్



వేములవాడ: రాజన్నను జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్ సోమవారం తన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కుమ్మరి శంకర్, జనరల్ సెక్రటరీ పెంట బాబు, శంకర్, రాజేశం ఉన్నారు.









కూతురి ప్రేమ పెళ్లిపై కన్నీటి నిరసన

- బిడ్డ చనిపోయిందంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు
- సోషల్ మీడియాలో వైరల్



కూతురు ఫ్లెక్సీ వద్ద కన్నీరు పెడుతున్న నిర్మల-మురళీకృష్ణ



హరికుమార్-అనూష

సిరిసిల్ల: అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు ఇంటి నుంచి వెళ్లిపోయి, ప్రేమ పెళ్లి చేసుకుందని ఓ తండ్రి కన్నీరు పెట్టుకున్నాడు. ఆమె చనిపోయిందంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలిపిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల పట్టణంలోని బీవై.నగర్‌కు చెందిన చిలువేరి మురళీకృష్ణ, నిర్మల దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు అనూష హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. వారం రోజుల కిందటే కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన ఆమె స్థానికంగా ఉండే లింగం హరికుమార్‌ను ఆదివారం ప్రేమ వివాహం చేసుకుంది. అనూష తీసుకున్న ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. సోమవారం తమ ఇంటి ఎదుట అశ్రునివాళి అంటూ.. కూతురు ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'అమ్మలారా.. అయ్యలారా.. మాలాంటి కష్టం ఎవరికీ రావొద్దు.. కూతురును ఎంతో ప్రేమతో పెంచి, చదివిస్తే.. ఆమెను మోసం చేసి, ట్రాప్ చేసి ఇంటి నుంచి తీసుకెళ్లారంటూ..' విలపించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గెలిపిస్తే.. ఏడాదిలో రైలు

- అవకాశం ఇవ్వండి.. ఆశీర్వదించండి
- సిరిసిల్లలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్
- మార్నింగ్ వాక్.. రైతు బజారులో సందడి



వ్యాపారులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల: కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తే.. ఏడాదిలో సిరిసిల్లలో రైలుకూత వినిపించేలా చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం మార్నింగ్ వాకింగ్ చేస్తూ.. వాకర్స్‌తో మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో చేసిన పనులను వివరించారు. బతుకమ్మ ఘాట్ వద్ద, రైతుబజారు, మినీస్టేడియం వద్ద పలువురితో ముచ్చటించారు. ఐదేళ్ల అధికారంలో ఉండి కరీంనగర్ జిల్లాకు ఏం చేయలేక పోయాడని ఎంపీ బండి సంజయ్‌ని ఉద్దేశించి విమర్శించారు. ఆత్మహత్యకు పాల్పడిన నేతకార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. వేప పుల్ల వేసుకుని.. బైక్‌పై ఊరంతా తిరిగారు. క్రికెట్ ఆడి, క్రీడాకారులకు డ్రెస్సులు అందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, అక్కరాజు శ్రీనివాస్, దార్నం లక్ష్మీనారాయణ, జిందం చక్రపాణి, అగ్గిరాములు, చెన్నమనేని శ్రీకుమార్, మంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



దుబ్బయ్య (ఫైల్)

వేములవాడరూరల్: ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వేములవాడరూరల్ మండలం మర్రిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నక్క దుబ్బయ్య(70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై, గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారులు ఉన్నారు. కుమారుడు మల్లేశం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు.

నేతన్నల సమస్యలపై దిగొచ్చిన సర్కార్

సిరిసిల్ల: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం సిరిసిల్లలో 'నేతన్నలకు అండగా దీక్ష' తలపెట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చిందని బీజేపీ జిల్లా నాయకులు సోమవారం ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఆసాములతో సమావేశమయ్యారని పేర్కొన్నారు. బతుకమ్మ చీరల బకాయిలు త్వరలోనే చెల్లిస్తామని, ఇతర డిమాండ్లు కూడా నెరవేరుస్తామని హామీ ఇచ్చారని వివరించారు. మంత్రి ఇచ్చిన హామీతో వస్త్ర పరిశ్రమ సమ్మెను విరమించుకున్నట్లు ఆసాములు, వస్త్రోత్పత్తిదారులు ప్రకటించారన్నారు. బండి సంజయ్ దీక్ష చేస్తానని ప్రకటించిన నేపథ్యంలోనే ప్రభుత్వం దిగొచ్చిందని స్పష్టం చేశారు. ఇది బీజేపీ సాధించిన విజయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప రామకృష్ణ, రెడ్డబోయిన గోపి తెలిపారు. బతుకమ్మ చీరెల బకాయిలు రూ.270కోట్లు చెల్లించాలని, కొత్త ఆర్డర్లు ఇవ్వాలని, పవర్‌లూమ్స్‌కు 50 శాతం విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. బండి సంజయ్ సిరిసిల్లలో బుధవారం నిర్వహించతలపెట్టిన దీక్షను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

రాజన్నకు అమావాస్య ఎఫెక్ట్



వేములవాడ: ప్రతీ సోమవారం భక్తుల రద్దీతో కిటకిటలాడే వేములవాడ రాజన్న క్షేత్రం ఈ సోమవారం అమావాస్య రావడంతో భక్తులు లేక వెలవెలబోయింది. సోమవారం అమావాస్య సందర్భంగా ఆలయంలో పలు పూజలు నిర్వహించారు.

రాజన్న ధర్మగుండంలోకి గోదావరి జలాలు



ధర్మగుండంలోకి చేరుతున్న గోదావరి జలాలు

వేములవాడ: వేములవాడ రాజన్న భక్తుల పుష్కరిణిగా పేరొందిన ధర్మగుండంలోని అపరిశుభ్రమైన నీటిని ఆలయ అధికారులు తొలగించారు. మిడ్ మానేరు నుంచి నేరుగా గోదావరి జలాలను నింపారు. దీంతో సోమవారం స్వచ్ఛమైన నీటిలో భక్తులు పుణ్యస్నానం చేశారు. కొన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు ముగిసి, వేసవి సెలవులు ప్రారంభమవడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు నిత్యం స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. వారికి భద్రత కల్పించేందుకు జిల్లా పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో ఆలయ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. మండుతున్న ఎండలకు గొంతులు ఎండిపోయి భక్తులు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. దీంతో ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 6 రాజన్న జలప్రసాదాల కేంద్రాలు దాహార్తిని తీరుస్తున్నాయి.

ఆవు చనిపోయిందని మనోవేదన..

గుండెపోటుతో మృతి



జగన్‌రెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆవు చనిపోయిందనే మనోవేదనలో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని బండలింగంపల్లికి చెందిన మార్పు జగన్‌రెడ్డి(40) తండ్రి 25 ఏళ్ల క్రితం చనిపోవడంతో తన అమ్మమ్మ ఊరు ఎల్లారెడ్డిపేటకు వచ్చాడు. 15 ఏళ్లుగా డెయిరీఫాం నడుపుతున్నాడు. ఆదివారం రూ.లక్ష విలువ చేసే ఓ ఆవు అనారోగ్యంతో చనిపోగా.. తీవ్ర మనస్తాపానికి గురై, భోజనం చేయలేదు. సోమవారం గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. మృతుడికి భార్య రమ్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. జగన్‌రెడ్డి మృతదేహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి నివాళి అర్పించారు.

ఎల్లారెడ్డిపేటలో రెండిళ్లపై దాడులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని రెండిళ్లపై స్థానిక పోలీసులు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సోమవారం దాడులు చేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాలతో సోదాలు చేశామని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ తెలిపారు. భూముల డాక్యుమెంట్లు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం మండలంలో వడ్డీ వ్యాపారం నిర్వహించేవారి ఇళ్లలో తనిఖీలు చేసి, భారీగా నగదు, అప్పుల ప్రామిసరీ నోట్లను పోలీసులు పట్టుకెళ్లారు. వరుస ఘటనలతో వడ్డీ వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నట్లు తెలిసింది. ఎంతకాలం నుంచి అధిక వడ్డీకి అప్పులిస్తున్నారు.. ఎంతెంత.. ఎంత మందికి ఇచ్చారన్న వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. దాడులు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ ధ్రువీకరించారు. విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.



















